
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.6 : కనిష్ఠం 24.7
కామారెడ్డి జిల్లా వార్తలు
5
మంగళవారం 18 జూన్ 2024



విద్యుత్ శాఖ ప్రజావాణికి పది దరఖాస్తులు

ఎల్లారెడ్డి, జూన్ 17: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణికి పది దరఖాస్తులు వచ్చినట్లు ఎల్లారెడ్డి డీఈ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

రేషన్ కార్డుల కోసం.. ఎదురు చూపులు!



NATIONAL FOOD SECURITY CARDS
Government of Telangana
Department of Consumer Affairs, Food & Civil Supplies

- కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరం
- గతంలో ప్రభుత్వం స్వీకరించిన ఆరు గ్యారెంటీల్లో కనిపించని ఆప్షన్
- వేరుగా దరఖాస్తులు చేస్తున్న అర్హులు
- ఎన్నికల కోడ్ ముగియడంతో కార్డులపై ఆశలు
- జిల్లాలో రేషన్‌కార్డులు ఉన్నది 2.53 లక్షల మందికి మాత్రమే

కామారెడ్డి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు లేకపోవడంతో గత ప్రభుత్వ హయాం నుంచి అనేక మంది సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. శాసన సభ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అనుకున్నట్లుగానే అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. వివిధ కేటగిరీల కింద ఆరు గ్యారెంటీలకు 13.82లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో తెల్లరేషన్‌కార్డు కోసం ఆప్షన్ ఇవ్వకపోవడంతో ఆరు గ్యారెంటీ దరఖాస్తులతో పాటు నేరుగా తెల్ల కాగితంపైనే రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించారు. రేషన్‌కార్డులు ఇస్తామని ప్రభుత్వం ఆశలు చిగురింపచేస్తున్నా స్పష్టత మాత్రం రావడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు కొత్త రేషన్‌కార్డులను ఇస్తుందోనని దరఖాస్తుదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రేషన్ కార్డులు లేక ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పేద, మధ్య తరగతి ప్రజలు దూరమవుతున్నారు. రేషన్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ వస్తోంది.

జిల్లాలో 2.53 లక్షల రేషన్ కార్డులు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 2.53 లక్షలు మాత్రమే రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,34,743 ఉండగా అంత్యోదయ ఆహార భద్రత కార్డులు 17,655 ఉన్నాయి. అన్నపూర్ణ కార్డులు 901 ఉన్నాయి. ఈ కార్డులకు మొత్తం 8.59 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రేషన్‌కార్డు ఆధారంగా నే ఆయా కుటుంబాలకు పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు మంజూరు చేస్తూ వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కొన్ని పథకాలకు మాత్రమే రేషన్‌కార్డును ప్రామాణికంగా చేశాయి. ఆ ప్రభుత్వం కొత్త స్కీంలు తీసుకువచ్చినప్పటికీ పలు స్కీంలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోలేదు. ఇదే నేపథ్యంలో రేషన్‌కార్డుల కోసం గత 10 ఏళ్ల లో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నా మోక్షం లభించలేదు. ప్రభుత్వం సైతం దరఖాస్తులను పెండింగ్‌లోనే ఉంచింది.

కార్డులు లేని కుటుంబాలు లక్షకు పైగానే

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 21,85,539 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సుమారు రేషన్‌కార్డులు లేని దారిద్రరేఖకు దిగువన ఉన్న లక్షకు పైగానే ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీంలకు రేషన్‌కార్డే ప్రామాణికం కానున్నందున సదరు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 2,53,305 తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి ప్రకటించడంతో తెల్లరేషన్‌కార్డుకు మరింత డిమాండ్ పెరిగింది.

పెండింగ్‌లో 40,042 వేలకు పైగానే దరఖాస్తులు

గతంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2016లో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అరకొరగానే కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంకా జారీ చేయలేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 40,042 దరఖాస్తులు వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌లు విచారణ చేపట్టారు. దాదాపు 4200 మంది అర్హులుగా తేల్చిన ట్లు అధికారులు చెబుతున్నారు. వివరాలు పౌర సరఫరాలశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విచారణ సమయంలో కొత్త కార్డులు వస్తాయని చాలా మంది దరఖాస్తుదారులు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కార్డుల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షిస్తున్నారు. అదే విధంగా కుటుంబంలో తమ పిల్లలకు వివాహాలు జరిగి కోడళ్ల పేర్లను, వారికి జన్మించే పిల్లల పేర్లను కార్డులో చేర్చేందుకు కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వడం లేదు. రేషన్‌కార్డుల్లో పేర్లు కలిగి ఉన్న వారిలో ఎవరైన మరణిస్తే వారి పేర్లను తొలగించేందుకు మాత్రం అవకాశం కల్పించింది. రేషన్‌కార్డుల్లో పేర్లు లేని వారికి ఏదైన ఆరోగ్య సమస్య వస్తే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచిత సేవలు పొందేందుకు సంబంధిత పత్రాలు సమర్పిస్తే కలెక్టరేట్‌లో అప్పటికప్పుడే వారి పేరిట కలెక్టర్ సంతకంతో తాత్కాలికంగా ఓ కార్డును జారీ చేసేవారు. ప్రస్తుతం ఆ కార్డులు కూడా ఇవ్వడం లేదని పలువురు బాధితులు చెబుతున్నారు.

ఆరు గ్యారెంటీలకు 13.82లక్షల దరఖాస్తులు

జిల్లాలోని 25 మండలాలు, మూడు మున్సిపాలిటీల్లో గత జనవరిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో పథకాల వారీగా మొత్తం 13,82,644 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మహాలక్ష్మి పథకంలోని రూ.500 గ్యాస్ సిలిండర్‌కు 2,52,175 ఎక్కువగా దరఖాస్తులు రావడం జరిగింది. తర్వాత ఇందిరమ్మ ఇళ్లకు 2,45,541 దరఖాస్తులు రావడం జరిగింది. తర్వాత మహాలక్ష్మి పథకంలోని మహిళలకు నగదు రూ.2,500 లకై 2,40,120 దరఖాస్తులు వచ్చాయి. ఉచిత విద్యుత్‌కు 2,32,015 దరఖాస్తులు రాగా ఉపాధి కూలీలకు (రూ.12 వేల కోసం) 1,63,846, రైతుభరోసాకు 1,62,343, ఇతర పింఛన్‌లకై 69,518, దివ్యాంగుల పింఛన్‌లకు 7,640, కౌలు రైతు పథకానికి 7201, తెలంగాణ ఉద్యమకారుల ఇంటి స్థలం కోసం 1878, అమరవీరుల ఇంటి స్థలం కోసం 367 దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు తెల్లరేషన్ కార్డులకు లక్షకు పైగానే దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ పథకాలన్ని లబ్ధిచేకూరాలంటే ప్రభుత్వం మొదట రేషన్ కార్డులను మంజూరు చేయాలని పలువురు దరఖాస్తు దారులు కోరుతున్నారు.



త్యాగాలకు ప్రతీక బక్రీద్

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



కామారెడ్డిలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, జూన్ 17: త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. బక్రీద్ వేడుకల్లో భాగంగా ఆయన సోమవారం కామారెడ్డి పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఈద్గా వద్ద ప్రార్థనలు చేసి అందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సజ్జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వమానవాళికి అందిస్తుందని తెలిపారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తుందని అన్నారు. సకల మత విశ్వాసాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ రాష్ట్రంలో, దేశంలో పాలన కొనసాగాలని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు శాంతియుతంగా కలిసిమెలిసి జీవించేలా గంగా, జమునా తహజీబ్‌ను కాపాడుకుంటూ అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లాను ప్రార్థించానని తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హాఫీజ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ కన్నయ్య పుస్తకాలను, నోట్‌బుక్‌లను షబ్బీర్‌అలీకి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు శివకృష్ణమూర్తి, వంశీ, పిట్ల వేణు, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు సందీప్, పండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి



- నిబంధనలు పాటించని డ్రైవర్లు
- ఇటీవల 23 మంది విద్యార్థులను ఒకే ఆటోలో తరలిస్తుండగా గుర్తించిన ఆర్‌టీవో అధికారులు
- ప్రమాదపుటంచున విద్యార్థుల ప్రయాణం
- కిక్కిరిసిన ఆటోల్లో పాఠశాలలకు విద్యార్థులు
- పరిమితికి మించినా పట్టించుకోని అధికారులు
- తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం

బడి ఆటో.. భద్రమేనా?

కామారెడ్డి టౌన్, జూన్ 17: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. పుస్తకాలు, యూనిఫాం, లంచ్ బాక్సులు లాంటి వస్తువులు కొనడంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వీటన్నింటికంటే ముఖ్యమైనది పిల్లలు పాఠశాలకు చేరే విధానంపై ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం లేదు. దీనిని ఆసరాగా చేసుకుని సంబంధిత వాహనాల యజమానులు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఆటోలు ముందు వరుసలో ఉన్నాయి. డబ్బు సంపాదనే తప్ప పిల్లల ప్రాణాల గురించి చాలా మంది ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఇటీవల జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీలో 23 మంది ఆటోల్లో తరలిస్తుండగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఆర్‌టీవో అధికారులు గుర్తించారు. పిల్లలను ఆటోలో కుక్కి తీసుకువెళ్లడంపై అధికారులే ఆశ్చర్యానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా నిత్యం ఎంత మంది పిల్లలను ఎక్కిస్తే అంత ఆదాయం వస్తుంది అనే ఆలోచనలోనే డ్రైవర్లు ఉంటున్నారు. ఇదే ప్రమాదాలకు ముఖ్యకారణంగా మారుతోంది. స్కూల్ బస్సుల సమాచారం పూర్తిగా రవాణాశాఖ అధికారుల దగ్గర ఉంటుంది. కాబట్టి వీరు కొంత మేరకు నిబంధనలు పాటిస్తుంటారు. కానీ స్కూల్ ఆటోల సమాచారం అధికారుల వద్ద ఉండదు. ఈ ఆటోలకు రవాణా శాఖ నుంచి ప్రత్యేకమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. దీంతో అధికారులు కూడా వీటిని నియంత్రించలేక పోతున్నారు. ఎక్కువ శాతం ఆటోలు ప్రధాన రహదారుల నుంచి కాక సందుల్లో, చిన్నచిన్న రోడ్ల వెంట పిల్లలను తీసుకెళ్తుండడంతో వీటిపై నియంత్రణ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆటోలపై తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

ఏ ప్రమాదం ఎలా ముంచుకోస్తుందో?

నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను కుక్కి శరవేగంగా డ్రైవర్లు ఆటోలను దూకిస్తుంటారు. ఒకవైపు పాఠశాల సమయం ముగుస్తుందని గేటు వేస్తారని ముందు వెనక చూసుకోకుండా దుసుకువస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యంతో పాఠశాలల ఆటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రైవేట్ బస్సులకు ఫీజులు చెల్లించే స్తోమత లేని కారణంగా తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను ఆటోలో పంపించాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక పల్లెల నుంచి సరైన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఆటోలు, టాటా మ్యాజిక్ లాంటి వాహనాలను పాఠశాల విద్యార్థులను తరలించేందుకు జిల్లాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాలకు సంబంధించి ఎప్పటినుంచో ఉన్న నిబంధనలను ఆటో డ్రైవర్‌లు పాటించడం లేదు. సాధారణ ఆటోలల్లో విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించకూడదు. టాటా మ్యాజిక్‌లో 10 మందికి మించకూడదు. డ్రైవర్ల పక్కన ఎట్టి పరిస్థితుల్లో కూర్చోపెట్టకూడదు. స్కూల్ ఆటోలకు సైడురాడ్లు తప్పక అమర్చాలి. ప్రతీ స్కూల్ ఆటోలో ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి. ఆటోలకు సంబంధించిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎఫ్‌సీ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. డ్రైవర్ యూనిఫాం తప్పని సరిగా ధరించాలి. ఈ నిబంధనలు పాటించకుంటే పోలీసు, రవాణాశాఖ దాడుల్లో పట్టుబడితే జరిమానాలు భారీగా ఉంటాయని అధికారులు తెలుపుతున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడి ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే భారీ జరిమానాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులూ.. తస్మాత్ జాగ్రత్త

ఆటోలల్లో డ్రైవర్ సీటుకు అటు, ఇటు, లోపల కాస్తా కూడా ఖాళీ లేకుండా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆటోలల్లో విద్యార్థుల రాకపోకలు మాత్రం ఆగడం లేదు. ఏదైన ప్రమాదం జరిగిన తర్వాత బాధపడేకంటే తల్లిదండ్రులు ముందే మేల్కోనాలని అధికారులు పేర్కొంటున్నారు. బడి పిల్లలను ఆటోలల్లో స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు ఆటోలల్లో అసలు ఎంత మంది వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ ఎన్ని ట్రిప్పులు వేస్తుండని తెలుసుకోవాలి. ఆటోడ్రైవర్ పూర్తి వివరాలు ప్రతీ తల్లిదండ్రుల వద్ద ఉండాలి. డ్రైవర్ ఎంత స్పీడ్‌లో వెళ్తున్నాడో, పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. ఆటో సమాచారాన్ని సంబంధిత పాఠశాలలకు తల్లిదండ్రులే అందించాలి. స్కూల్ యాజమాన్యాలు, సిబ్బంది కూడా వారి స్కూళ్లకు ఎక్కువ మంది పిల్లలను తీసుకువచ్చే ఆటోలను అనుమతించకూడదు. ఏదైన జరగరాని ప్రమాదం జరిగితే స్కూల్‌లకు చెడ్డవారు వస్తుందని, స్కూల్ యాజమాన్యం కూడా బాధ్యతగా మెలగాల్సిన అవసరం ఉందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో పిల్లలను తరలిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డిని అభివృద్ధి చేయడమే లక్ష్యం

- రోడ్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ. 36 కోట్లు మంజూరు
- పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా ..
- 50 ఎకరాల్లో ఐటీ కారిడార్ ఏర్పాటుకు కృషి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జూన్ 17: ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.36 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రూ.200 కోట్లు నిధులు తీసుకొచ్చాను అని అన్నారు. పోచారం ప్రాజెక్టును వంద కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని, 50 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐటీ కారిడార్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈనెల 20న అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి నిధులు సమకూర్చడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటి నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేస్తామని ఎక్కడ అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిబాబా, మునిసపల్ చైర్మన్ సత్యనారాయణ, జడ్పీటీసీ ఉషాగౌడ్, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు ఆరీఫ్, సామెల్, గోపికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సోమవారం తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్‌కు తెలిపారు. ఆసుపత్రిలో తగిన డాక్టర్లు లేకపోవడం, శానిటేషన్, తాగునీరు, ఎక్స్‌రే తదితర సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ జడ్పీటీసీ ఉషాగౌడ్, మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నాయకులు ఆరీఫ్, గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అందని బిల్లులు.. అవస్థలో పాడి రైతులు



నడ్కుడలోని విజయ డెయిరీ సెంటర్‌లో పాలు పోస్తున్న మహిళా రైతు

డొంకేశ్వర్, జూన్17: ప్రభుత్వ డైరీలో పాలు పోసి పాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 15రోజులకు ఒక్కసారి బిల్లులు ఇస్తున్నారు. గత ఆరు నెలల క్రితం వరకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేశారు. మే నెల నుంచి జూన్ 15వ తేదీ వరకు బిల్లులు రావాల్సి ఉంది. పాడి రైతులకు రావల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లించక పోవడంతో జిల్లాలోని పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామంలోని విజయ డెయిరీ సెంటర్ 2లో 40మంది పాడి రైతులు ప్రతీరోజు ఉదయం సాయంత్రం వేళల్లో 120లీటర్ల పాటను విజయ డెయిరీకి పోస్తారు. పాలు పోసి రైతులకు మూడు విడుదల పాల బిల్లులు ఇంకా ఇవ్వలేదు. దీంతో సెంటర్ నిర్వహించే ఇన్‌చార్జీలకు రైతులు బిల్లులు ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. బిల్లులు రాకపోతే గేదేలకు దాన గడ్డి ఏలా తీసుకురావాలని గేదేలు కొన్నప్పుడు తీసుకున్న బాకీలు వాటికి కిస్తీలు ఎలా చెల్లించాలంటూ సెంటర్ నిర్వాహకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల పట్ల విజయ డెయిరీ అధికారులు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రధానంగా పాలు పోసి రైతులు వ్యవసాయం పాడిపశువులపై ఆధారపడి జీవిస్తారు. గత మూడు బిల్లుల డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో సంఘంతో పాటు చిట్టీల డబ్బులు రోజువారీ ఖర్చులు చెల్లించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు డెయిరీలకు పాలు పోస్తే సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసం చేస్తారని రైతులు పాలు పోయక అందుకే తక్కువ ధర అయినప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థలైన విజయ డెయిరీకి పాలు పోస్తున్నామన్నారు. ప్రభుత్వం కూడా రైతులకు పాల బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాల బిల్లులు తొందరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పాల బిల్లు తొందరగా చెల్లించాలి

పాల బిల్లులు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నారు. దీంతో మాకు ఇబ్బంది ఏర్పడుతుంది. కుటుంబ అవసరాలతో పాటే గేదేల దాణా తేవడానికి డబ్బులు ఉండడం లేదు. గతంలో విజయ డెయిరీ ద్వారా పశువులకు దాణా సబ్సిడీపై ఇచ్చేవారు. ఇప్పుడు దాణా ఎక్కువ రేటు ఉంది. ఇకనైనా ప్రభుత్వం సబ్సిడీపై దాణా అందించాలి.

- మాడబోయి లక్ష్మీ (పాడి రైతు, నడ్కుడ)

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

డిచ్‌పల్లి, జూన్17: మండలంలోని ధర్మారం(బీ) గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజలింగంను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాజలింగం కామారెడ్డి జిల్లా గాంధారి మండలం బూర్గుల్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో చెక్కులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంపై విచారణ చేసిన అధికారులు అవకతవకలు నిజమని తేల్చడంతో కార్యదర్శి రాజలింగంను కలెక్టర్ సస్పెన్షన్ చేశారు. ధర్మారం(బీ) పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌తో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు భయందోళన మొదలైంది.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే


కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధన్‌పాల్

పెద్దబజార్, జూన్ 17: న్యూఢిల్లీలో శాస్త్రిభవన్‌లో బొగ్గు గనుల శాఖ కార్యాలయంలో తెలంగాణ నుంచి నూతనంగా బొగ్గుగనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గంగపురం కిషన్‌రెడ్డిని సోమవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. నిబద్ధతతో పాటు సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తే పార్టీ గుర్తిస్తుందనడానికి కిషన్‌రెడ్డి నిదర్శనమని అన్నారు. గతంలో కేంద్ర హోం సహాయ మంత్రిగా, పర్యాటక శాఖ మంత్రిగా, రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని మోదీ 3.0లో తెలంగాణ నుంచి ఇద్దరికి అవకాశం కల్పించినందుకు పెద్దలకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి : సీపీ

ఖిల్లా, జూన్ 17: నగరంతో పాటు జిల్లాలో కొన్ని కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లకు ఇళ్లు కిరాయికి ఇచ్చే ముందు వారికి సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలిపి ఇళ్లు కిరాయికి ఇవ్వాలని కోరారు. గతంలో కొన్ని కేసులు నమోదైనందున ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా నగరంతో పాటు జిల్లాలో డ్రోన్‌ల వాడకం చేయవద్దని కోరారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించి అనుమతులు తీసుకోవాలన్నారు. డీజే హైవాల్యూమ్, లౌడ్ స్పీకర్‌లను వినియోగిస్తే పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఆయన కోరారు. మాల్స్, సినిమా హాల్స్‌లో, హోటళ్లలో ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. సినిమా థియేటర్స్‌లో ఏ-సర్టిఫికెట్ సినిమాలకు మైనర్‌లను అనుమతించకూడదని ఆయన కోరారు.

పేరుకుపోతున్న చెత్త.. పట్టించుకోని అధికారులు

● పాముల భయంతో బిక్కు బిక్కుమంటున్న బస్తీవాసులు


రోడ్డుపక్కన పెరిగిన పిచ్చి మొక్కలు

మోస్రా,జూన్17: మండల కేంద్రంలోని బస్తీల్లో పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోయింది. బస్తీలు కొన్ని ఏరియాల్లో డ్రైనేజీ కూడా లేవు. శుభ్రత లేక ఎక్కడికి అక్కడే మురికి నిలువ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. రానున్న వర్షాకాలం సందర్భంగా రోగాలు ప్రబలే అవకాశం ఉన్నది. అదేవిధంగా పిచ్చి మొక్కలు పెరిగి చెత్త పేరుకుపోయింది. పాముల భయంతో బతుకుతున్నామని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇప్పటికి స్పందించలేదని ఆరోపిస్తున్నారు. కనీసం పరిశుభ్రం చేయించలేదని, నీటి కొరత ఏర్పడిన విషయం సదరు పంచాయతీ కార్యదర్శికి మొరపెట్టినా పట్టించుకోవట్లేదని స్థానికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాక ఎన్నో రోజులుగా భయం గుప్పిట్లో బతుకు కొనసాగిస్తున్నామన్నారు. కావున సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కారం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


మొక్కలతో నిండిన మురుగుకాలువ

సిద్దేశ్వరుడికి అభిషేకం


డొంకేశ్వర్ పాత ఊరిలోని శివలింగానికి జలాభిషేకం చేస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

పెర్కిట్, జూన్17: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలో భక్తులు సిద్దేశ్వరునికి అభిషే కాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. చుట్టుపక్కల నాలుగు జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి సిద్దేశ్వరుడిని దర్శించుకున్నారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవలో ఆర్మూర్ భజన మండలి సేవలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సిద్దులగుట్టపై విచ్చేసిన భక్తులకు సల్లగరిగే నడ్పి నర్సయ్య రుక్మబాయి కుటుంబసభ్యులు, పైపుల రాజారెడ్డి, అమ్దాద్ గ్రామవాసి దన్‌కాంత్ కుటుంబసభ్యులు భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, ఎస్సై అశోక్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారీ సతీష్, బొండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టను దర్శించుకున్న సివిల్ జడ్జి


సిద్దులగుట్టపై దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి

ఆర్మూర్‌రూరల్, జూన్17: ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్దులగుట్టను సోమవారం నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి పి.పద్మావతి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. గుట్టపై ఉన్న శివాలయంలో పూజలు నిర్వహించారు. నవనథ సిద్దులగుట్టపై వెలిసి స్వయంభు శివలింగానికి పంచామృతలతో అభిషేకాలు చేశారు. సిద్దులగుట్టపై నెలకొన్న స్వయంభు శివలింగం ప్రాముఖ్యత, సిద్దులగుట్ట చరిత్ర, నవనాథ సిద్దుల తపస్సు తదితర విషయాలను పురోహితుడు కుమారశర్మను సీనియర్ సివిల్‌జడ్జి పద్మావతి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీని యర్ సివిల్‌జడ్జి పద్మావతి మాట్లాడుతూ సిద్దులగుట్ట అద్భుతంగా ఉందని, పవిత్ర సిద్దులగుట్ట మహత్యం చాలా గొప్పదని తెలిసి కుటుంబసభ్యులతో కలిసి వచ్చామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్‌జడ్జి పద్మావతిని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఖాందేశ్ శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు


భూమిని చదును చేస్తున్న రైతు


టిప్పర్ ద్వారా చెరువు మట్టిని తరలిస్తున్న రైతు

మోర్తాడ్, జూన్17: రైతులు వర్షాకాలం పంటలు వేయడానికి తమ భూములను సిద్ధం చేసుకుంటున్నారు. తమ భూముల్లో భూసారాన్ని పెంచడానికి చెరువుల నుంచి పూడికమట్టిని తరలిస్తున్నారు. మండలంలోని రైతులు రబీ సీజన్ ముగిసి పంటలు చేతికందడంతో ఖాళీ అయిన భూముల్లో పంటలు వేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోని చెరువు మట్టిని టిప్పర్‌ల ద్వారా తమ భూముల్లోకి తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ మట్టికి సుమారు రూ.6వేలు ఖర్చుచేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగుచేసే పసుపు, మొక్కజొన్న పంటలు అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు నల్ల మట్టిని వాడుతున్నారు. అంతేగాక ఇతర ప్రాంతాల నుంచి పెండలారీలను, గొర్ల ఎరువును తెప్పిస్తున్నారు. ఒక పెండ లారికి సుమారు రూ.20వేల ధర పలుకుతుంది. గొర్ల ఎరు వు ఖరీదైన గాని రైతులు వెనుకడుగు వేయకుండా అధిక దిగుబడి కోసం పంటలకు వాడుతున్నారు. రైతులు తమ భూములకు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ప్రకారం వ్యవసాయఅధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధికంగా పంటలు దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు ఖరీఫ్‌పంటలపై గ్రామాల్లో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. రైతులు వ్యవ సాయాధికా రుల సూచనలు పాటిస్తే మరింత దిగుబడి సాధించే అవ కాశం ఉంది. తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

గ్రామ పంచాయతీ భవనం మంజూరు ఎప్పుడో!

● అద్దెభవనంలో కొనసాగుతున్న చేనంబర్ తండా పంచాయతీ కార్యాలయం



బంజారా సంఘంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ

మోస్రా,జూన్17: తండాల అభివృద్దిలో భాగంగా గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగానే మోస్రా మండలంలో చే నెంబర్ తండా(దుబ్బ)ను బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ చే నెంబర్ తండా గ్రామ పంచాయతీ ఏర్పాటు 2019 ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. మా తండాలో గ్రామ పంచాయతీ భవనం లేక గ్రామపం చాయతీని బంజారా సంఘంలో కొనసాగిస్తున్నామని గ్రామ పంచాయతీ నిర్మాణం చేయాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి గ్రామస్థులు, గ్రామ నాయకులు తీసుకెళ్లారు. మండల అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ భవనం నిర్మాణం కోసం 2023 సంవత్సరం జూన్ నెలలో స్థలాన్ని పరిశీలించగా, స్థల వివాదం కారణం వాళ్లు ఏం చేయలేక ఊరుకున్నారని స్థానికుల సమాచారం.

పంచాయతీ భవనం నిర్మాణం కొరకు మండల అధికారుల, మండల నాయకుల, గ్రామ నాయకుల సమక్షంలో స్థలాన్ని పరిశీలించినప్పటికీ శంకుస్థాపన చేయలేదు. అదేవిధంగా ఈ గ్రామ పంచాయతీలో కేవలం ఒక కార్యదర్శి, వాటర్ మెన్ ఇద్దరు మాత్రమే పని చేస్తూ ఉన్నారు. ఇక్కడ సిబ్బంది కొరత ఉన్నది. సిబ్బందిని ఏర్పాటు చేస్తే కొద్ది రోజులు మాత్రమే పని చేసి మానేశా

బంజారా సంఘంలో కార్యాలయం కొనసాగుతోంది.


● గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి

గ్రామ పంచాయతీ ఏర్పడిన నుండి గ్రామ బంజారా సంఘంలోనే కొనసాగుతూ వస్తుంది. సొంత భవనం ఏర్పడితే పలు సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రజలకు మరింతసేవ చేయవచ్చు.

'చంద్రబాబు ఆదేశిస్తే స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తాం'

బోధన్‌రూరల్,జూన్17: తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇస్తే తెలంగాణలో వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని జిల్లా పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు యాదగౌడ్ అన్నారు. సోమవారం బోధన్‌కు వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా తెలుగుదేశం పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొడాలి రవికుమార్, రామ్మూర్తి నాయుడు తదితరులున్నారు.

వర్షాలు కురియాలని పూజలు

బోధన్‌రూరల్,జూన్17: బోధన్ మండలంలోని రాజీవ్ నగర్ తండా గ్రామంలో సకాలంలో వర్షాలు కురియాలని గ్రామస్థులు సోమవారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ సంప్రదాయ ప్రకారం స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు వర్షాల కొరకు నిరీక్షణ పడకుండా సకాలంలో వర్షాలు కురియాలని, పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శివలింగానికి జలాభిషేకం

డొంకేశ్వర్, జూన్17: మండల కేంద్రంలోని పాత ఊర్లో ఉన్న గంగానది ఒడ్డున ఉన్న శివలింగానికి సోమవారం డొంకేశ్వర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వర్షాలు కురువాలని ప్రత్యేక పూజలు చేశారు. పక్కనే ఉన్న గంగానది నుంచి గంగాజలాలు తీసుకువచ్చి శివలింగానికి జలాభిషేకం, పాలాభిషేకం చేశారు. భజన కీర్తనలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతీ సంవత్సరం సిరి నైవేద్యాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంల పాడి పంటలు సల్లంగా ఉండాలని వేడుకున్నారు.

హరితహారం చెట్ల నరికివేత


సాహెబ్‌పేట్ వద్ద రహదారికి ఇరువైపుల నరికివేసిన హరితహారం చెట్లు

వేల్పూర్, జూన్17: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించేందుకు రహదారులకు ఇరువైపుల హరితహారం మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం చెట్లుగా ఎదిగాయి. అయితే చెట్లు ఏపుగా పెరగడం వల్ల నీడతో తమ భూమిలో పంటలు సరిగ్గా పడడం లేదంటు ఒక వైపు రైతులు, మరోవైపు విద్యుత్ సరఫరా అటంకం కలుగుతున్నాయి. దీంతో కరెంటు వైర్లకు తాకుతు ఉన్న హరితహారం మొక్కలను సిబ్బంది వాటిని నరికి వేస్తున్నారు. ముందు చూపు లేకుండా ఉపాధిహామీ పథకం సిబ్బంది విద్యుత్ లైన్‌లను గమనించకుండా, అలాగే రైతుల భూముల్లో నాటుతూ తమ లక్ష్యాన్ని పూర్తిచేయడంతో ఈ దుస్థితి నెలకొంది. మండలంలోని ప్రధానరహదారుల పెరిగిన హరితహారం చెట్లు ఈ రకంగా నరికి వేతకు గురవుతుండడం, మరో వైపు అగ్నికి కాలిపోవడం వల్ల లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయం వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో వరిసాగుపై సదస్సు

డిచ్‌పల్లి,జూన్ 17: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో మంగళవారం ఉదయం 11గంటలకు రైతులకు వానాకాలంలో వరిసాగు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వార అవగహన కల్పిస్తారని మండల వ్యవసాయాధికారి రాంబాబు తెలిపారు.

విగ్రహాలకు తొలగని ముసుగు

డొంకేశ్వర్, జూన్ 17: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చిందంటే హడావిడి చేసి సంబంధిత అధికారులు ఎన్ని కలు పూర్తయిన తర్వాత ఇంత హడావిడి కనిపించలేదు. గ్రామాల్లో ఉన్న బ్యానర్లు, పార్టీల జెండాలు, గోడలపై ఉన్న రాతలు తొలగిం చడంతో విగ్రహాలకు ముసుగులు వేయడంతో బిజీబీజీ అవుతారు. ఎన్నికల కోడ్ ముగిసి 15 రోజులు అవుతున్న డొంకేశ్వర్ మండలం తొండకూర్ గ్రామంలోని ప్రధానకూడలి వద్ద ఒక్కే వరుసలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ, నెహ్రూ విగ్రహాలు ఉన్నాయి. అదే వరుసలో ఉన్న గాంధీ విగ్రహానికి ముసుగు తొలగించి మాజీ ప్రధాన మంత్రులు నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలకు ముసుగు అలాగే ఉంచారు. కోడ్ పూర్తయిన అధికా రులు ముసుగు తొలగించడంలేదు. ప్రతినిధ్యం గ్రామపంచాయతీ కార్యా లయానికి ఆ విగ్రహం ముందు నుంచే అధికారులు వెళ్తారు. విగ్రహాలకు ముసుగు వేసిన అధికారులకు ఇవి కనిపించకపోవడం విశేషం.


తొండాకూర్‌లో విగ్రహాలకు తొలగించని ముసుగు

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిరికొండ జూన్ 17 : తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని దొంగలు చొరబడి పద్దెనిమిదిన్నర తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సీఐ బిక్షపతి సిరికొండ మండలం న్యావనంది గ్రామంలో గన్నారం రాంచందర్ ఇంటిలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడి బంగారాన్ని అపహరించారు.రాంచందర్ బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లగా ఆయన భార్య శ్యామల రావుట్లలో పెద్ద నాన్న చనిపోవడంతో అక్కడికి వెళ్లింది. రాంచందర్ కుమారులు రోహిత్, ప్రణీత్‌తో పాటు వారి స్నేహితుడు మారుతీ తో కలిసి రాత్రి కింది ఇంటికి తాళం వేసి పై పోర్షన్‌లో నిద్రించారు. రాత్రి రెండు గంటలకు శ్యామల పెద్ద కుమారుడు రోహిత్ టాయిలెట్ కోసం కిందికి వచ్చినప్పటికి గమనించలేదని చెప్పినట్లు సీఐ తెలిపారు. ఉదయం ఏడున్నర గంటలకు వచ్చి చూడగా డోరు తీసి ఉందని తెలిపారు. ఇంటిలోపలికి వెళ్లి చూడగా బీరువ తెరిచి ఉందని వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయని రోహిత్ చెప్పారని సీఐ చెప్పారు. ఇంట్లో దొంగలు పడిన విషయం తెలియగానే ఇంటి యజమానురాలు శ్యామల న్యావనందికి చేరుకుని బీరువాలో చూడగా బొంగారం అపహరణకు గురయిందని బోరున విలపించారు. తొమ్మిది తులాల లాంగ్‌చైన్, నాలుగు తులాల నల్లపూసలు,మూడు తులాల బంగారు ఆభరణము, రెండు తులాల బ్రాస్‌లెట్, అర్ధ తులం ఉంగరం పోయినట్లు శ్యామల తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ భిక్షపతి వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు సీఐ తెలిపారు. సంఘన స్థలాన్ని సీసీఎస్ ఏసీపీ కిషన్ డాగ్ స్క్వాడ్‌తో వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. సీఐ వెంట దర్పల్లి ఎస్సై విక్రమ్, సిరికొండ ఏ ఎస్సై బాల్‌సింగ్ ఉన్నారు.


వివరాలు సేకరిస్తున్న సీఐ

ఉప పీఠానికి నేడు జగద్గురు రాక



జగద్గురు రాకను పురస్కరించుకుని ఏర్పాట్లు చేస్తున్న మహిళా భక్తులు

మద్నూర్, జూన్ 17: జుక్కల్ మండలంలోని తెలంగాణ ఉపపీఠానికి జగద్గురు నరేంద్రచార్య మహారాజ్ ఈనెల 18, 19వ తేదీలలో రెండు రోజుల పాటు ఉప పీఠానికి వచ్చి భక్తులకు సమస్య పరిష్కారం, మార్గదర్శనం చేస్తారని సంస్థానం నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కాకుండా మహిళా వాలంటీర్లు ఏర్పాట్లను చేస్తున్నారు. నరేంద్రనాథ్ మహారాజ్ రాకను పురస్కరిం చుకుని ఒకరోజు ముందు నుంచే జుక్కల్ మండలానికి భక్తులు తరలి వచ్చి బారులు తీరారు. రెండు రోజుల పాటు ఉపపీఠంలోనే ఉండి ప్రజలకు మార్గదర్శనం చేస్తారని నిర్వా హకులు వెల్లడించారు. కార్య కర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను గోడ పత్రాలను అందజేశారు. తెలంగాణ ఉప పీఠం అంతర్గతంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొనే భక్తుల కోసం ఏర్పాటు చేసినట్లు సంస్థాన్ నిర్వాహ కులు వెల్లడించారు. ఈఉపపీఠానికి జగద్గురు ప్రతి మూడు నెలలకు ఒకసారి వచ్చి ప్రజలకు మార్గదర్శనం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

నిజాంసాగర్‌లో గిడ్డంగులు ఏర్పాటయ్యేనా..?



గిడ్డంగుల కోసం ఏర్పాటు చేసిన స్థలం

నిజాంసాగర్, జూన్ 17: కేంద్ర ప్రభుత్వం జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్‌లో భారతఆహార గిడ్డంగులు నిర్మాణానికి రెండేళ్ల క్రితం స్థలం చూశారు. నవోదయ సమీపంలోని 560 సర్వే నెంబర్‌లో 20 ఎకరాల భూమిని భారత ఆహార సంస్థకు కేటాయించారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఈ గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేసింది. స్థలం కేటాయించినా ఇప్పటికి నిర్మాణానికి నోచుకోలేదు. ఈ గిడ్డంగులను నిర్మించి 8 మండలాలకు సివిల్ సప్లైకు బియ్యాన్ని సరఫరా చేసేందుకు 5 వేల మెట్రిక్ టన్నుల గిడ్డంగులను నిర్మించేందుకు అప్పట్లో ఖరారు చేశారు. కాల క్రమేణా ప్రభుత్వాలు, పాలకులు మారినప్పటికి ఈ గిడ్డంగుల నిర్మాణం ఊసే లేకుండా పోయింది. నిజాంసాగర్ మండల కేంద్రంలో ప్రభుత్వం భూమిని సేకరించారు. ప్రభుత్వ భూమిని గిడ్డంగుల సంస్థకు అప్పగించారా ? ప్రతిపాదనలకే పరిమితమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గిడ్డంగుల నిర్మాణంచేపట్టేనా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి గిడ్డంగుల నిర్మాణం చేపట్టాలనగా, శ్రీకారం చేపట్టకపోవడం గమనార్హం. మండల కేంద్రంలో భారత ఆహార సంస్థ గిడ్డంగుల నిర్మాణం అయ్యేనా అని మండల వాసులు ఎదురు చూస్తున్నారు. ఈ స్థలంపై బడా బాబులు కన్నేసినట్లు సమాచారం. గిడ్డంగులు నిర్మించకుండా కబ్జా చేసేందుకు ప్రయత్నాలు కొనసాగు తున్నటు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా, గతంలో భారత ఆహార గిడ్డంగుల కోసం భూమిని కేటాయించారని వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,జూన్17: మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులోని అటవీ ప్రాంతంలో ఆకుల గంగారాం(60) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడు రెంజల్ మండలం దూపల్లికి చెందిన వాడని, గత నెల 26న అతడు అదృశ్యం అయ్యాడని ఎస్ఐ పేర్కొన్నారు. సోమవారం పశువుల కాపరులు మృతదేహన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

డిచ్‌పల్లి,జూన్ 17:ప్రభుత్వ ముప్పై పడకల ఆస్పత్రి, డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ఘన్‌పూర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బైకుపై వచ్చిన ఇద్దరుదుండగులు మహిళమెడలో నుంచి బంగారు గొలుసు అపహరించి పరారయ్యాయరని ఘన్‌పూర్‌గ్రామయువ కులు తెలిపారు.సమాచారం అందుకున్న గ్రామయువకులు సీసీపుటేజీని పరిశీలించగా కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల ఆచూకీ లభించ లేదు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవీపేట,జూన్17: మండలంలోని జన్నేపల్లి శివారులో ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మండలంలోని నిజాంపూర్ నుంచి నవీపేట వైపు ఇసుక ట్రాక్టర్ వస్తుండగా జన్నేపల్లి వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

జిల్లాలో భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



బీర్కూర్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

బీర్కూర్, జూన్ 17:మండలంలో బక్రీద్ పర్వదిన వేడుక లను ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బీర్కూర్‌తో పాటు కిష్టాపూర్, దామరంచ, వీరాపూర్, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో ముస్లీంలు పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం మసీదులు, ఈద్గాల వదకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకున్నామని తెలిపారు. పండుగ సందర్భంగా ముస్లీం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధు మిత్రులతో సంతోషంగా గడిపారు. బక్రీద్ విశిష్ఠతలో భాగమైన ఖుర్బానీని చుట్టూ పక్కల వారికి దానంగా అందజేశారు. ఇదిలా ఉండగా వివిధ పార్టీల నాయకులు ముస్లీం సోదరులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

భిక్కనూరు:మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లీంలు బక్రీద్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి ముస్లీం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ మేరకు ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెల్పుకున్నారు. అనంతరం ఇండ్ల వద్ద ఖుర్బానీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా మండలంలోని ప్రజా ప్రతినిధులు ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

● **ప్రభుత్వవిప్ షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు**

బక్రీద్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి భిక్కనూరు మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, నాయకులు లింబాద్రి, సుదర్శన్, సిద్దాగౌడ్, కుంట లింగారెడ్డి, దయాకర్‌రెడ్డి, రేఖసుదర్శన్, దాబా సురేష్, తిర్మల్ స్వామి, శ్రీనివాస్, స్వామి, జీవన్, సిద్ధరాములు, బాబు, ఎల్లం, స్వామి,ఆయాగ్రామాల కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్నూర్:ఉమ్మడిమద్నూర్ మండలంలో బక్రీద్ పండుగను ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ పండుగ అంటే ఇబ్రహీం ప్రవక్త యొక్క నిజాయతీకి త్యాగానికి నిదర్శనమని అన్నారు. మానవులకు తనదైన శైలిలో పరీక్ష పెడతారని పరీక్షల్లో నెగ్గి దేవుని కృపకు పాత్రులు కావాలని దైవ మార్గాన్ని విడవద్దని, అల్లా చూపిన సన్మార్గంలోనే నడవాలని వక్తలు ఈద్గా వద్ద ముస్లీం సోదరులకు పండుగ విశిష్ఠత గురించి తెలిపారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణంలో ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీల నాయకులు ముస్లింలను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులున్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాలలో సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా మైనారిటీ సోద రులు ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం గ్రామ గ్రామాన మైనారిటీ సోదరులు ప్రత్యేక ప్రార్థన అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో నసురుల్లాబాద్ మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్, గ్రామ పెద్దలు ఈద్గా చేరుకుని మైనారిటీ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో మైనారిటీ సోదరులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ:కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం దోమకొండ మండల కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ సలహదారులు షబ్బీర్‌అలీని కలసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు నయీం, ఇలీయాస్‌లకు పుష్పాగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి,సీతారాం మధు, నాయకులు, నర్సారెడ్డి,శంకర్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ,సంతోష్‌రెడ్డి,నరేష్, శ్రీహరి,తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్తదుస్తులు ధరించి ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చందాపూర్,ఎర్రపహాడ్, తాడ్వాయి,కృష్ణాజీవాడి,చిట్యాల,నందివాడ గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మజీద్,ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ముస్లింలు చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగను జరుపుకున్నారు.

సదాశివనగర్: మండలకేంద్రంతో పాటు ఆయాగ్రామాలలో బక్రీద్ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మైనార్టీలు ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మోహినోద్దిన్, మండల కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ దస్తగిరి, జలీల్,రఫీ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండగ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



నసురుల్లాబాద్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ సర్పంచ్



బాన్సువాడలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



నాగిరెడ్డిపేట ఈద్గాలో ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నాగిరెడ్డిపేట:మండలంలోని వివిధ గ్రామాల్లో ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) పండుగను సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి గ్రామ పొలిమేరల్లో ఉన్న ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ఈద్గా ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని ఈద్గాలో మసీదు పేష్ ఇమాం అహ్మద్ ఫరీఫోద్దీన్, నమాజ్ ప్రార్థనలు చేయించారు. నమాజ్ ప్రార్థనల అనంతరం కుల మతాలకు అతీతంగా ఈద్ ముబారక్ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

హరితహారం మొక్కలపై అధికారుల నిర్లక్ష్యం ?



బస్వన్నపల్లలో మొక్కలను నరికివేసిన దృశ్యాలు



రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నరికివేసిన దృశ్యాలు

రాజంపేట, జూన్ 17:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం మొక్కల పెంపకం నీరుగారిపోతుంది. మండలంలో రోజురోజుకు హరితహారం మొక్కలు నరికివేతకు గురవుతున్నాయి. కొన్నిరోజుల క్రితం బస్వన్నపల్లి గ్రామపరిధిలోని రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటగా వాటిని ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన వ్యక్తులు నరికివేసినట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వం కోట్లరూపాయలు ఖర్చు చేస్తూ అధికారులటార్గెట్ పూర్తిచేసుకోవడానికి గ్రామపంచాయతీ నిధుల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి మొక్కలు కొనుగోలు చేసి రోడ్డుకు ఇరువైపులా పెట్టినప్పటికి మొక్కలకు రక్షణ కల్పించకపోవడం, పర్య వేక్షణ లోపంతోమొక్కలు దక్కకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజాధనం బుడిద పాలవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు అధికారులు ప్రయాణించే దారిలో నరికిన మొక్కలు గమనిం చకపోవడం అధికారుల పనితీరు, అధికారుల నిర్లక్ష్యం కనపడుతుందని అన్నారు. సంవత్సరం పాటు నర్సరీలో విత్తనాలు వేసి మొక్కలు పెంచి రోడ్లకి ఇరువైపులా నాటి పచ్చదనంలా పెరిగిన మొక్కలపై గుర్తుతెలియని వ్యక్తులు కట్‌చేసిన పట్టించుకోవడం లేదని హరితప్రేమికులు ఆరోపిస్తున్నారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ లోపం వల్లమొక్కలకు గ్రామస్థాయిఅధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికా రులు మండలంలోని గ్రామాలల్లో పర్యవేక్షణ చేసి హరితహారం మొక్క లను రక్షణ ఏర్పాటుచేసేవిధంగా చర్యలు తీసుకోవా లని కోరుకుంటు న్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రాజేశంను వివరణ కోరగా కొన్ని రోజుల క్రితం బస్వన్నపల్లి గ్రామపరిధిలో రోడ్డుకు ఇరువైపు లా నాటిన మొక్కలను నరికిన వ్యక్తులను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. హరితహారం మొక్కలపై నిర్ల క్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని తెలిపారు.

సదాశివనగర్‌లో బీజేపీ నేతల సమావేశం



అత్యధిక ఓట్లను పడేలా చూసిన బూత్‌అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

సదాశివనగర్, జూన్ 17:మండల కేంద్రంలో బీజేపీ బూత్‌లెవల్ సమావేశం జరిగింది. తెలంగాణ బీజేపీ అధికారం తప్పక చేపడుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు రామ్‌రెడ్డి అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల పనితీరును అన్ని గ్రామాల బూత్ అధ్యక్షుడు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గ్రామాల వారిగా బీజేపీబలోపేతానికి కృషిచేసిన వారికి కృతజ్ఞ తలు తెలిపారు. మండలంలో మొత్తం పోలైన ఓట్లు 25234కాగా ఇందులో బీజేపీకి 12688 ఓట్లు వచ్చాయని తెలిపారు.ఇందులో అత్యధికంగా ఓట్లు పడేలా చూపసిన సదాశివనగర్‌బూత్ 59 అధ్యక్షుడు ధర్మారెడ్డి,బూత్ 60 అధ్యక్షుడు గంగయ్య, కుప్రియల్ బూత్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్‌లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి అమృతభూం రావు, మార రమేష్ రెడ్డి, మండల ఉపాధ్యాక్షులు స్వరన్‌రెడ్డి, ప్రవీణ్, మోహ న్‌రాజ్, ఓబీసీ అధ్యక్షుడు కటికేరమేష్, ఎస్‌టీమోర్చా అధ్యక్షుడు చందర్ నాయక్, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌లు జైపాల్‌రెడ్డి,వడ్లశ్రీనివాస్,వెంకటేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం'



బీర్కూర్‌లో విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న ఏఈ రాంప్రసాద్

బీర్కూర్,జూన్17: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని, ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే విద్యుత్ సమస్యలను పరిష్కరి స్తామని విద్యుత్ శాఖ ఏఈ రాంప్రసాద్ పేర్కొ న్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభు త్వం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి వినియోగదారులు పెద్ద ఎత్తున విచ్చే శారు. విద్యుత్ సమస్యలపై ఏఈకి ఫిర్యాదు చేశారు.ఈసందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ రాంప్రసాద్ మాట్లాడుతూ టీఎస్ ఎన్‌డీపీసీఎల్‌సీఎండీ,ఎస్ఈకామారెడ్డి ఆదే శాల మేరకు బీర్కూర్ విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని తెలిపారు.విద్యుత్ వినియోగ దారులు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో ఇవ్వాలని ఏఈ తెలిపారు. వినియోగదా రులు ఇచ్చిన ఫిర్యాదులను సమీక్షించి సమస్య లను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసు కుం టాని చెప్పారు. విద్యుత్ సమస్యలపై పలు వురు వినియోగదారులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశా రు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, వినియోగ దారులురైతులుతదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలపై విచారణ జరిపి న్యాయం చేయాలి

పెద్దబజార్, జూన్ 17: నీట్ పరీక్షలపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్ష వ్యవహారంలో కేంద్రంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంజిత్, రఘురాం, హన్మాండ్లు, అంజలి, రాధాకుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసిన నాయకులు

.బాన్సువాడటౌన్ , జూన్ 17: ఇటీవల విదేశి పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన విభాగ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌సింగ్ రాథోడ్, దశరథ్ , దత్తు , చిన్న తదితరులున్నారు.



బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- మహారాజ
శాంతి	- ఓసీ
ప్రియా 70	- మనమే
ప్రియా 35	- హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి	- ఇంద్రాణి
వెంకటేశ్వర	- మహారాజ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	240

